క్లుప్తంగా

17న విద్యుత్ అదాలత్

మైదుకూరు: మైదుకూరులో శుక్రవారం విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జీవీ రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విద్యుత్ డివిజనల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ అదాలత్ ఉంటుందని తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాలలోని అన్ని మండలాల వినియోగదారులు అదాలత్‌లో తమ సమస్యలపై రాతపూర్వక ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని కోరారు.

నేడు బ్ర.మఠంలో ధ్వజస్తంభ ప్రతిష్ట

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో పూర్వపు ధ్వజస్తంభం స్థానంలో నూతన ధ్వజస్తంభాన్ని గురువారం మఠం నిర్వాకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. మఠం ప్రత్యేక పూజారులు ఆచార్య ఇడమకంటి జనార్ధనశివాచార్య, పడకండ్ల వెంకటాచార్యులు, పోలేపల్లె రామబ్రహ్మం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దాతల సహకారంతో ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మఠం మేనేజర్ ఈశ్వరాచారి కోరారు.

వృద్ధులకు మందుల పంపిణీ



వృద్ధులకు మందులు పంపిణీ చేస్తున్న వెంకటేష్

కాశినాయన : మండలంలోని సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలోని వృద్ధులకు బుధవారం సోషల్ సర్వీస్ స్కీం కో ఆర్డినేటర్ టి.వెంకటేష్ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతినిత్యం అవసరమయ్యే ఐరన్ మాత్రలు, గ్లూకోజ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రతి నెల ఆశ్రమంలో ఉన్న అవ్వాతాతలకు తానే మందులు అందిస్తానని తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు రామతులసి, వృద్ధులు వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దుస్తుల పంపిణీ



వరికుంట్ల కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధి

కాశినాయన : మండలంలోని నరసాపురం, కోడిగుడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, వంకమర్రి, ఇటుగులపాడు, వరికుంట్ల, గొంటువారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలు, వరికుంట్ల కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో చదువుతున్న 900 మంది విద్యార్థినీ విద్యార్థులకు బుధవారం పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో వారి ప్రతినిధి ఎల్.ప్రసాద్‌రెడ్డి ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనం

కలసపాడు : స్థానిక షిరిడిసాయిబాబా ఐటీఐ కళాశాలలో బుధవారం మాదిగల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి బాబుజగ్జీవన్‌రామ్ ఆశయసాధన సమితి జిల్లా అధ్యక్షుడు సగిలిజాకోబ్ పాల్గొని మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీన బాబుజగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నిర్వహించే సభకు నియోజకవర్గంలోని దళిత మాదిగ ఉప కులాల సమావేశంలో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జగ్జీవన్‌రామ్ ఆశయాలతో మాదిగజాతి యావత్తు అభివృద్ధి పథంలో నడిచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దళితులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

కాశినాయన : ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల సీపీఎస్‌ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం నరసాపురంలోని ఎమ్మార్సీ భవనంలో వారు మాట్లాడుతూ నూతన పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, పీఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రతినెల 1వ తేదీన జీతాలు వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు రామచంద్రుడుకు వినతిపత్రం అందజేశారు.

వెన్నపూస రవీంద్రారెడ్డి ముమ్మర ప్రచారం

కడప కార్పొరేషన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి కడపలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. బుధవారం రాజీవ్ పార్కు సమీపంలోని చైతన్య స్కూల్‌లో ఏజీఎం రమణ, ప్రిన్సిపాల్, సిబ్బందిని కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. ఆ తర్వాత విద్యుత్ భవన్‌లో ఉద్యోగులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను బలపరచాలని కోరారు.

అల్లాడుపల్లె మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

- పర్యవేక్షించిన ఈఓ శ్రీనివాసులు
- నేడు ఉత్సవాల నిర్వహణపై సమావేశం



విద్యుద్దీప అలంకరణలో వీరభద్రస్వామి దేవస్థానం ఆర్చీ

చాపాడు : జిల్లాలో ముఖ్య పుణ్యక్షేత్రమైన మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి సన్నిధిలో ఈ నెల 18, 19వ తేదీలలో జరుగనున్న మహా శివరాత్రి ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ప్రాంగణమంతా పరిశుభ్రంగా చేయటంతో పాటు రంగులు వేశారు. ఇదే క్రమంలో ఆలయానికి వచ్చే మైదుకూరు రోడ్డు, ప్రొద్దుటూరులో ఉండే ఆర్చీలకు విద్యుద్దీపలంకరణ చేపట్టారు. వీరభద్రుడి సన్నిధిలో అన్నదాన సత్రం పూర్తి స్థాయి నిర్మాణ పనులు వేగవంతంగా చేస్తున్నారు. ఈఓ శ్రీనివాసులు పర్యవేక్షణలో శివరాత్రి పండుగ నిర్వహణ ఏర్పాట్లు జరుగుతుండగా అన్నదాన సత్రం వద్ద సర్పంచ్ కిషోర్ కుమార్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి పనులు చేయిస్తున్నారు.

నేడు శివరాత్రి ఉత్సవ నిర్వహణపై సమావేశం..

మహా శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై గురువారం మధ్యాహ్నం 3 గంటలకు అన్ని శాఖల అధికారులు, పాలక మండలి సభ్యులచే సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణలో భాగమైన అధికార యంత్రాంగానికి ఉన్నతాధికారులు ఆదూశాలు జారీ చేశారని, సమావేశానికి హాజరైన పండుగ నిర్వహణపై చర్చించాలని ఈఓ కోరారు.

నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు దోహదం



క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

బద్వేలు అర్బన్ : క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ల ద్వారా విద్యార్థులు తమలోని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు వీలుపడుతుందని కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ తెలిపారు. బుధవారం రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒకవైపు చదువుకుంటూనే ఉద్యోగాలు సాధించేందుకు ఇటువంటి క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఏటా కళాశాలలో ప్రముఖ కంపెనీలతో జాబ్‌మేళాలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 38 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరవ్వగా వారిలో ప్రతిభ ఆధారంగా 14 మంది అభ్యర్థులను వివిధ పోస్టులకు ఎంపిక చేశారు. ఎంపికైన అభ్యర్థులు శిక్షణ అనంతరం ఉద్యోగంలో చేరతారని తెలిపారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, హెటిరో ల్యాబ్స్ హెచ్‌ఆర్ సీమోన్, కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకులు పరిమళ, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలి

ప్రొద్దుటూరు : కత్తి నరసింహారెడ్డిని ఎమ్మెల్సీగా రెండోసారి గెలిపించాలని ఏపీటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి ప్రచారం చేశారు. బుధవారం ప్రొద్దుటూరులోని పాఠశాలల్లో వారు ప్రచారం చేశారు. క్రుష్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లేటి ప్రభాకర్ రెడ్డిని వారు కలిశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపకుల హక్కుల పరిరక్షణకు పటిష్టవంతమైన నాయకుడిని మేధావుల సభకు పంపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలరాజు, సహాయ కార్యదర్శి అశోక్, తేజ పాల్గొన్నారు.

సీపీఎం ఉద్యమాలను బలపర్చండి

పోరుమామిళ్ల : ప్రజల కొరకు నిరంతరం శ్రమిస్తున్న సీపీఎం పార్టీకి అండగా నిలవాలని, సీపీఎం నిర్వహిస్తున్న ఉద్యమాలను బలపరుస్తూ విరాళాలు ఇవ్వాలని బుధవారం ఆ పార్టీ నాయకులు పట్టణంలో ఇంటింటికీ వెళ్లే ప్రజలను కోరారు. సీపీఎం మండల కార్యదర్శి వరప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై, కార్మికుల హక్కుల కొరకు, పేదవారి సదుపాయాల కొరకు సీపీఎం దశాబ్దాలుగా పోరాడుతున్న పార్టీకి అండగా నిలబడుతూ విరాళాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నేతలు గౌసియాబేగం, వరలక్షుమ్మ, శ్రీనివాసులు, రవి, ఓబులమ్మ తదితరులు దుకాణాల వద్దకు వెళ్లి కరపత్రం ఇచ్చి విరాళాలు అర్థించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని, అన్ని శాఖలకు చెందిన అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు.

అనుమతి తప్పనిసరి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ ఆకుల వెంకటరమణ

బద్వేలు అర్బన్ : ఆయా పంచాయతీలతో పాటు పట్టణాల్లో నిర్మించే భవన నిర్మాణాలకు, ఏర్పాటు చేసే లేఅవుట్‌లకు అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అనుమతి తప్పనిసరిగా ఉండాలని అనుడా వైస్ చైర్మన్ వై.ఓ.నందన్, ఆర్డీఓ ఆకుల వెంకటరమణలు తెలిపారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆన్‌లైన్ బిల్డింగ్ ప్లాన్ అనుమతి ప్రక్రియపై డివిజన్ పరిధిలోని ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీల్లో 300 చదరపు మీటర్లు కంటే తక్కువ వైశాల్యం ఉన్న బిల్డింగ్ ప్లాన్ అనుమతి ప్రక్రియకు ఎంట్రోల్యాబ్ వారిచే అభివృద్ధి చేయబడిన వెబ్ అప్లికేషన్‌ను ఉపయోగించుకోవాలని, ఈ అప్లికేషన్ మార్చి 1 నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అలాగే 300 చదరపు మీటర్ల కంటే ఎక్కువ వైశాల్యం ఉన్న నిర్మాణాలకు, లేఅవుట్‌లకు తప్పనిసరిగా అనుడా అనుమతి ఉండాలని కోరారు. అనుమతుల ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలో చేపట్టడం ద్వారా పారదర్శకత పెరుగుతుందన్నారు. అలాగే ఆయా పంచాయతీల్లో ఉన్న అక్రమ నిర్మాణాలు, అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓలు ఆసిఫ్, కృష్ణసింగ్, డీఎల్‌పీఓ రమణారెడ్డి, ఆయా మండలాల ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌సీఈఆర్‌టీ ఫ్యాకల్టీ మహ్మద్ గౌస్

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉపాధ్యాయులు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచడానికి కృషి చేయాలని ఎస్‌సీఈఆర్‌టీ ఫ్యాకల్టీ మహ్మద్ గౌస్ పేర్కొన్నారు. బుధవారం రామేశ్వరం ఎస్‌పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్, ఈశ్వర్ నగర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, తాళ్లమాపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం అమలును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదవడం, రాయడం వచ్చి ఉంటే విద్యార్థులు వ్యాఖ్యాలను రాయగలరని, ఉపాధ్యాయులకు బోధన సులువు అవుతుందని చెప్పారు. లిప్ విధానం పైలట్ ప్రాజెక్టుగా మన జిల్లాలో అమలు చేస్తున్నారని, ఆ తర్వాత రాష్ట్రం అంతా అమలవుతుందన్నారు. ఎంఈఓ సావిత్రమ్మ, డీఆర్పీలు నరసింహారెడ్డి, గంగాధర్ నాయుడు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు భాస్కర్ సరస్వతి పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపిక

మైదుకూరు : మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన విద్యార్థి గొడ్లవీటి భాస్కర్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు విజయనగరంలో జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో అండర్ -17 విభాగంలో భాస్కర్ పాల్గొని ప్రతిభ చూపి సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి కడపలోని వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొననున్నట్లు తల్లిదండ్రులు నాగయ్య, అంజనమ్మ తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికై న భాస్కర్‌ను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

అప్పన్న స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



సింహాచలం అప్పన్న స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు : విశాఖపట్నం సమీపంలోని సింహాచలం అప్పన్నస్వామిని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాజారాంరెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌జీఓ కాలనీ సమీపంలో 957/2 సర్వేనెంబరులో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ నాయకులతో కలిసి అక్రమ నిర్మాణాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. అత్యంత విలువైన ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి జకరయ్య, సహాయ కార్యదర్శి చంద్రమోహన్‌రాజు, జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, పట్టణ కార్యదర్శి బాలు, సహాయ కార్యదర్శులు నరసింహ, పి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

సమాజ ప్రయోజనమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం కావాలి

వైవీయూ : జాతీయ సేవాపథకంలోని ప్రతి ఒక్కరూ సమైక్యంగా పనిచేయడం ద్వారా సమాజ ప్రయోజనాలను నెరవేర్చవచ్చని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం వైవీయూలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్‌కు చెన్నైకి చెందిన రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మూడురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సామాజిక సేవలో యువతను భాగస్వాములను చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో నీటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటి నుంచి బయటపడేందుకు పర్యావరణ పరిరక్షణ, జలసంరక్షణ వంటి చర్యలు చేపట్టాలన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలు

దువ్వూరు : మండల పరిధిలోని మూడిండ్లపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ ఆలయ, ధ్వజ శిఖర ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా బుధవారం మూల విరాట్‌లైన సీతారామ లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలకు వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాలకు క్షీరాభిషేకం, అవాహిత పూజ, విగ్రహ జలోద్వాసన వాస్తు నవగ్రహ విగ్రహమూర్తుల జపాలు, యంత్రాభిషేకం, చండీ దీక్షా హోమం, మహాగణపతి మన్యసూక్తి హోమాలు నిర్వహించారు. విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామాల్లోని వీధుల గుండా మంగళవాయిద్యాలతో ఊరేగించారు. గ్రామస్తులు స్వాములకు వారికి కాయకర్పూరం సమర్పించారు.

నేడు బండలాగుడు పోటీలు

న్యూ కేటగిరి ఎద్దులకు గురువారం ఉదయం 7.30 గంటలకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.50,016, రెండో బహుమతి రూ.40,016, మూడో బహుమతి రూ.30,016, నాల్గో బహుమతి రూ.20,016, ఐదో బహుమతి రూ.10,016, ఆరో బహుమతి రూ.5,016 అందిస్తామని వివరించారు.



నల్లగొండుపల్లెలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కోలాటం వేస్తున్న కోలాట బృందం

కలసపాడులో..

కలసపాడు : మండలంలోని నల్లగొండుపల్లె గ్రామంలో బుధవారం వైభవంగా శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వాముల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజ, జప పారాయణములు, గణపతి, రుద్ర, నవగ్రహ, చండీ, సుదర్శన, మూల మంత్ర హోమములు నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన, ధాన్యాదివాసము తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామోత్సవం వెంట రాష్ట్ర హంస అవార్డు గ్రహీత సగిలిపుల్లయ్య చెక్కభజన బృందం ఆధ్వర్యంలో కోదండరామ కోలాట బృందం వేసిన కోలాటం, సిద్దయ్య బృందం వేసిన చెక్కభజన అలరించింది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



మాట్లాడుతున్న కొనిరెడ్డి శివచంద్రారెడ్డి



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మతల్లి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని అమృతానగర్‌లో ఉన్న పెద్దమ్మతల్లి ఆలయం 12వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు బాలమునిరెడ్డి, గురుప్రతాప్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కిశోర్, సౌభాగ్యలక్ష్మి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.